ముసురుతో పంటల వర్షార్పణం

- మిర్చి, కంది, పొగాకు పంటలతో నష్టం
- నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని డిమాండ్


వర్షానికి పూత రాలిపోయిన కంది పంట


ఓబులక్కపల్లిలో మిర్చిని కళ్లంలో ఆరబెడుతున్న రైతు

పెద్దారవీడు: మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారింది రైతన్నల పరిస్థితి. ఇటీవల నాలుగు రోజులు కురిసిన చిన్నపాటి వర్షానికి మిరప, పొగాకు, కంది, మినుము, జొన్న, కూరగాయలు తదితర పంటలు చేతికి వచ్చే దశలో ముసురు వర్షాలు కురవడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే తామర పురుగు ప్రతాపంతో మిర్చి తోటలు సర్వనాశనం అయ్యామని రైతులు బాధపడుతున్నారు. ఇటీవల నాలుగు రోజులు ముసురు వర్షాలకు అన్నదాతలు ఇబ్బంది పడ్డారు. ఎకరాకు ఐదు నుంచి 10 క్వింటాళ్లు కూడా దిగుబడులు రావని రైతులు దిగులు చెందుతున్నారు. రైతులు మిర్చి కోసి కళ్లాల్లో ఆరబోశారు. ఆకాశం మేఘావృతమై అకాల వర్షం కురవడంతో కొందరి రైతుల మిర్చి వర్షానికి తడిసింది. మరి కొందరు హడావుడిగా ఉరుకులు పరుగులు దీసి కళ్లాల్లో ఆరబోసిన మిర్చిపై టార్పాలిన్ పట్టలు కప్పుకున్నారు. రోజుల తరబడి అలాగే ఉంచడంతో బూజు పట్టిపోయాయి. వర్షం తెరపివ్వడంతో కళ్లాల్లో ఉన్న మిరప కాయలను తిరగ తిప్పుకుంటూ అధిక కూలి వెచ్చించి గ్రేడింగ్‌లు చేస్తున్నారు. ఎక్కువ శాతం రంగుమారి నాణ్యత తగ్గి తాలు కాయలుగా మారి పూర్తిగా నష్టపోయమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి పంటపై ఆశలు కోల్పోయి చేతికొచ్చిన కొద్దిపాటి పంటను అమ్ముకునేందుకు రైతులు సిద్ధమైన వేళ మిర్చి నాణ్యత లేక పోవడంతో వ్యాపారులు ధరలు తగ్గించి అడుగుతున్నారు. కళ్లాల్లో రంగు మారిన మిర్చిని వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నారు. దీంతో మిర్చిలో సగం రంగు మారిన కాయలే వస్తుండటంతో రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. పూత దశలో ఉన్న కంది కూడా పూత రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. పిందె దశలో తెగులు రావడంతో రసాయన మందులు పిచికారీ చేశారు. కందికి ఎకరాకు మందులకు, కూలీలకు, సేద్యానికి దాదాపు రూ.25 వేలు పెట్టుబడి అవుతుంది. దిగుబడి ఒక క్వింటా కందులు వచ్చే పరిస్థితి లేదు. కొట్టుకు వచ్చిన పొగాకు ఆకు మీద మడ్డి కారిపోయి ఆకు నాణ్యత బాగా తగ్గి రేటు పలకదు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలు వర్షార్పణం కావడంతో అప్పులు తెచ్చి పంటలు సాగు వేసిన అన్నదాతలు నట్టేట మునిగిపోయారు. ముసురు వర్షంతో మిరప కాయలు తడవకుండా కాపాడేందుకు అధిక ధరలతో పరదాలు కొనుగోలు చేసి కప్పుకున్నారు. మామూలుగా 60–60 సైజు పరదాలు రూ.7 వేలు అమ్మాల్సిన పరదా ఏకంగా రూ.10 వేలు పెంచి వ్యాపారులు దండుకున్నారని రైతులు చెబుతున్నారు. పరదాలు సైజు ఆధారంగా రైతుల నుంచి అత్యధికంగా రేటుతో కొనుగోలు చేశారు. ఇదే అదును అనుకొని వ్యాపారులు రైతుల నుంచి భారీగా వసూలు చేశారు. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో లబోదిబోమంటున్నారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం రైతులను అదుకోవాలి:



తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే అదుకోవాలి. 3 ఎకరాలు మిరప, 4 ఎకరాలు కంది పంట సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి కళ్లాల్లో ఉన్న మిరప కాయలు తిడిసి పోవడంతో తాలు కాయలు ఎక్కువ శాతం ఉన్నాయి. వ్యాపారులు అతి తక్కువ ధరకు అడుగుతున్నారు. కందిలో పూత, కాయ వచ్చే దశలో వర్షం కురవడంతో రాలిపోయింది. దిగుబడి క్వింటన్నర కందులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ముసురు వర్షంతో వ్యాపారులు గతంలో ఉన్న రేటు కంటే పరదాలు ఎక్కువగా రేటు అమ్మి సొమ్ము చేసుకున్నారు. పంటలపై పెట్టిన పెట్టుబడులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి పంటలకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– దుగ్గెంపుడి యాల్లారెడ్డి, రైతు, ఓబులక్కపల్లి

క్లుప్తంగా

ధనుర్మాస ప్రత్యేక పూజలు


పుల్లలచెరువులో నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

పుల్లలచెరువు: ధనుర్మాస ప్రత్యేక పూజలు మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ పూజారి అనంతాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాసం ముక్తి ప్రదాయిని అని అన్నారు. మండల కేంద్రంలో రోజూ భక్తులతో నగర సంకీర్తన జరుగుతుంది. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ మహావిష్ణువును పూజించడం, ఈ మాసంలో దీక్షతో విష్ణు సంకీర్తన చేస్తే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ నెల రోజుల పాటు ఉదయం భక్తులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కమిటీ ఏకగ్రీవం


నియామక పత్రంతో మల్లికార్జునరావు

త్రిపురాంతకం: బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడిగా సముద్రాల మల్లికార్జునరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్రిపురాంతకంలో బీజేపీ ఎన్నికల అధికారిగా మారంరెడ్డి ప్రతాపరెడ్డి వ్యవహరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ కమిటీ సభ్యులు పాల్గొనగా ఎన్నిక ఏకగ్రీవంగా మల్లికార్జునరావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పాతకోటి రాజేశ్వరావు, ప్రధాన కార్యదర్శిగా దగ్గుల నాసరరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రు పిచ్చయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు యోగేశ్వరరావు, నియోజక వర్గ కో కన్వీనర్ నర్సయ్య పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ముండ్లమూరు (దర్శి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని రైతు సంఘ అధ్యక్షుడు గాలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రజాసంఘాల నాయకులు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్లమెంట్లో అమిత్‌షా మాట్లాడుతూ అంబేడ్కర్ అనడం ఫ్యాషనైందని, దాని బదులు భగవాన్ అని 100 సార్లు అంటే పుణ్య లోకాలకు వెళ్తారంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమన్నారు. భారత రాజ్యాంగాన్ని రాసి ఎన్నికలు వ్యవస్థను తెస్తేనే ఎంపీ, మంత్రి వయ్యావని గుర్తుంచుకోవాలన్నారు. మానవ జాతి ఉన్నంత వరకు అంబేడ్కర్ పేరడ్కుంటుందని, అధికారం పోతే అమిత్‌షా పేరు ఎక్కడా గుర్తు పెట్టుకోరన్నారు. ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అక్కారావు, గాంధీ, రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు ఫ్రీజర్ వితరణ


ఫ్రీజర్ బాక్సును అందజేస్తున్న దాత, అధికారులు

దర్శి:

మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను పసుపులేటి వెంకట నారాయణ గురువారం బహూకరించారు. ఆ బాక్సును దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం దాత వెంకటనారాయణ తండ్రి నాసరయ్యను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఏఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి, రాంబాబు, సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, వైస్ చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి గణేష్, ట్రెజరర్ వేణు, డైరెక్టర్లు, అడ్వైజర్లు ఖాదర్ మస్తాన్, రాఘవులు, సుశీల, మోషే, సీహెచ్ బసవయ్య, వీఆర్వో మురళి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కమాండర్

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థులకు 34 ఆంధ్రా బెటాలియన్ ఒంగోలుకు చెందిన సంతోష్ సింగ్, ఎంవీ నారాయణ గురువారం శిక్షణ ఇచ్చారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ఈ నెలలో జరగబోవు ఏ సర్టిఫికెట్ పరీక్ష గురించి ఫిజికల్ టెస్ట్, రిటర్న్ టెస్ట్ సంబంధించిన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణలో విద్యార్థులకు జరగబోయే ఫైనల్ ఏ సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో మంచి రిజల్ట్ వస్తుందన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేర్ టేకర్ కాశే నరసింహారావు విద్యార్థులకు పాఠశాలలో సమగ్ర శిక్షణ అందిస్తున్నారని ఆంధ్రా బెటాలియన్ అధికారులు తెలిపారు. 34 ఆంధ్రా బెటాలియన్ నుంచి వచ్చిన కమాండర్ ఆఫీసర్ మోహన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ శిక్షణ ఇచ్చారు.

ఇరువర్గాల ఘర్షణ

త్రిపురాంతకం: రెండు కుటుంబాల మధ్య వివాదం నెలకొని ఘర్షణ పడటంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు. మండలంలోని నడిగడ్డలో డిసెంబర్ 31 రాత్రి గొడవ జరిగింది. ఇరువర్గాలకు చెందిన వారు వరుసకు అన్నదమ్ములు. గతంలో వీరు తరుచూ గొడవలు పడుతుండే వారని ఎస్‌ఐ శివ బసవరాజు తెలిపారు.

పాఠశాల అభివృద్ధిలో ఎస్‌ఎంసీ సభ్యులదే కీలకపాత్ర


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ఇందిర


యర్రగొండపాలెం: మాట్లాడుతున్న ఎంఈవో ఆంజనేయులు


తాళ్లూరు: శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బయ్య


దొనకొండ: మాట్లాడుతున్న ఎంఈఓ సాంబశివరావు

పుల్లలచెరువు: పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులదే కీలకపాత్ర అని ఎంఈవో ఇందిర అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు, హెచ్‌ఎంలకు ఒక్క రోజు శిక్షణ గురువారం ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ, పాఠశాలల అభివృద్ధిలోనూ కమిటీ సభ్యులదే కీలకప్రాత అని అన్నారు. పాఠశాలలో జరుగుతున్న పలు విషయాలపై చర్చించి విద్యార్థుల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే విధంగా కమిటీ సభ్యులు ఉండాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కమిటీ సభ్యులు ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. పాఠశాలలో ఉన్న పలు చిన్న సమస్యలను కమిటీ సభ్యులు అర్థం చేసుకుని దాతల సహాయ సహకారాలతో ఉన్నతంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు పాఠశాలల కమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఎస్‌ఎంసీలు ఆదర్శవంతంగా పనిచేయాలని, పాఠశాలల సమస్యలు, పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. పాఠశాలల యాజమాన్య కమిటీలు సక్రమంగా పనిచేస్తే ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అవసరం ఉండదని, మండలంలోని అన్ని పాఠశాలలు చక్కగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో అమలు అవుతున్న పథకాలు, మౌలిక వసతులపై తల్లిదండ్రుల కమిటీలకు అవగాహన ఉండాలని, స్నేహపూర్వక వాతావరణంలో పర్యవేక్షించి మంచి మార్గనిర్దేశం చేయాలన్నారు. విద్యార్థులను బంగారు బాటలో నడిపించేందుకు తల్లిదండ్రుల కృషి ఎంతో అవసరం ఉంటుందని, డ్రాపౌట్లను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శిక్షణ తరగతుల్లో ఆర్‌పీలు ఎస్.జిలానీబాషా, డీవీఆర్ నాగరాజు, భానుప్రకాష్, ఖలీల్, చిన్న హుసేన్‌వలి పాల్గొన్నారు.

తాళ్లూరు: పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ సుబ్బయ్య సూచించారు. గురువారం స్థానిక వీకే ప్రభుత్వ హైస్కూల్లో ఎస్‌ఎంసీ చైర్మన్స్, ప్రాధానోపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో తమవంతు కృషి చేయాలన్నారు. ఎంఈఓ–2 సుధాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విధంగా చూడాలన్నారు. వీకే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, మండలంలోని 45 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీకి శిక్షణ

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ ఒక్క రోజు శిక్షణ గురువారం ఇచ్చారు. శిక్షణకు పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎన్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా మాట్లాడుతూ పాఠశాలకు ఎన్నికైన ఎస్‌ఎంసీ చైర్మన్ల విధి, విధానాలు వివరించారు. పాఠశాలలను మీరే అభివృద్ధి చేసుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లుగా కేజే బాబుప్రసాద్, ఎం.మోహన్ నరసింహం, మనోషలు వ్యవహరించి పలు సూచన, సలహాలందించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


తాళ్లూరు: రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: కంది ప్రస్తుతం పిందె, పూత దశలో ఉందని, ఈ దశలో కాయ ఈగ ఆశించే అవకాశం ఉందని, తగు చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. గురువారం తాళ్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాయ ఈగ ఆశించినప్పుడు నష్టం బయటకు కనిపించదన్నారు. పిల్ల పురుగు కాయ లోపల ఉండి గింజను తినేస్తుందన్నారు. తల్లి పురుగు కాయ లేత, పిందె దశలో ఉన్నప్పుడు కాయపై గుడ్లు పెడుతుందన్నారు. పురుగు అన్ని దశల్లో కాయ లోపల పూర్తి చేసుకుని తల్లి పురుగు మాత్రమే బయటకు వస్తుందన్నారు. నివారణకు 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలన్నారు. గింజ గట్టిపడే దశలో డైమెథోయేట్ 2 మిలీ లేదా ప్రొఫెనోఫాస్ 2.మిలీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వీఏఏలు నాగరాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం


వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈఓలు

కురిచేడు: మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్ కమతం రమణ ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు తమ ప్రదర్శనలను తీసుకొచ్చి వివరించారు. అతిథులు అన్ని ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించారు. ఎంఈఓలు ఆర్.వస్త్రాంనాయక్, సుబ్బారావు, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అనంతవరంలో రెవెన్యూ గ్రామసభ


అనంతవరం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి


పెద్దదోర్నాల: పెద్దబొమ్మలాపురంలో సదస్సుకు హాజరైన అధికారులు

దొనకొండ: మండలంలోని మంగినపూడి పంచాయతీ పరిధి అనంతవరంలో రెవెన్యూ అధికారులు గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రజల నుండి 9 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. పలు సమస్యల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. ఇంకా ఎవరైనా రెవెన్యూ సమస్యలుంటే తమకు అర్జీల రూపంలో అందజేయాలన్నారు. సర్పంచ్ రాచగొర్ల మహేష్, రీ సర్వే డీటీ కేవీ నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, వీఆర్‌ఓ గాలెయ్య పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: రెవెన్యూ సదస్సుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శాంతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో పొలాల మధ్య ఉన్న వివాదాలు, రహదారుల సమస్యలు, భూములు ఆక్రమించుకోవటం తదితర సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. పాసుపుస్తకాలు, మ్యూటేషన్‌లు, డీకే పట్టాల కోసం 17 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ, సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. దాతలకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. మెటీరియల్‌ను రూ.50 వేలు ఖర్చు చేసి 150 మంది విద్యార్థులకు అందజేశారు. మెటీరియల్ అందించేందుకు సహకరించిన ఉపాధ్యాయులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, బి.బాలకృష్ణ, పెద్దపోతు శంకరరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డిలకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎస్‌సీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.ఆనందరావు, ఎం.జాన్ సామ్యేలు, కె.రఘురామిరెడ్డి, డి.హసాన్, శ్యామ్, ఏడుకొండలు, మాధవి, గోపవనిత, లక్ష్మి, జానకీబాయి, రాజకుమారి పాల్గొన్నారు.

కురిచేడు చేరిన రామదండు

కురిచేడు: రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం రామేశ్వరం నుంచి బయల్దేరిన రామదండు మండల కేంద్రానికి గురువారం రాత్రి చేరుకుంది. గత రాత్రి మండలంలోని గొల్లపాలెంలో విడిది చేసిన రామదండు గురువారం రాత్రికి కురిచేడుకు చేరింది. రామదండును గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు. సీతాలక్ష్మణరామ, ఆంజనేయస్వాముల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కోదండరామాలయంలో విడిది ఏర్పాటు చేశారు.


గ్రామోత్సవం నిర్వహిస్తున్న రామదండు

ట్రాక్టర్–బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన రామాంజి

కురిచేడు: ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టరు–బైక్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఆవులమంద రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. పాణ్యానికి చెందిన తోట రామాంజి తన అత్తగారి గ్రామం మండలంలోని మునెయ్యకాలనీలో తన భార్య శ్రావణితో నివాసముంటున్నాడు. పగలంతా పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత సరుకుల కోసం తన ద్విచక్ర వాహనంపై దంపతులు కురిచేడు వస్తున్నారు. ఆ సమయంలో కురిచేడు నుంచి ఆవులమంద వెళ్తున్న ట్రాక్టర్.. కురిచేడుకు కూతవేటు దూరంలో ఆవులమంద రోడ్డులోని ఐనవోలు మేజరు సమీపంలో ఎదురుపడింది. రెండు వాహనాలు ఢీకొనటంతో రామాంజికి ఎడమకాలు తొడవద్ద విరిగి ఎముక బయటకు వచ్చింది. ముఖం, దవడ పూర్తిగా పగిలిపోయింది. 108 సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వెంకటప్పయ్య, మహబూబ్ బాషాలు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు రిఫర్ చేశారు.